క్లుప్తంగా

నేడు, రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

గంగవరం: మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఎంఈవో–2 మల్లేశ్వరరావు చెప్పారు. గంగవరం, మోహనాపురం కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులు గంగవరం ఆశ్రమ బాలికోన్నత పాఠశాల స్కూల్‌లో, టేకులవీధి, వేములోవ, నెల్లిపూడి కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులు టేకులవీధి ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో హాజరు కావాలన్నారు. లాంగ్వేజ్ సబ్జెక్ట్ టీచర్లు గంగవరం ఆశ్రమ హైస్కూల్‌లో హాజరుకావాలని సూచించారు. ఆయా సమావేశాలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉపాధ్యాయులందరూ హెడ్ ఫోన్ లేదా బ్లూటూత్ డివైస్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



భీమవారం పీహెచ్‌సీని సందర్శించిన ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: అనంతగిరి: గుమ్మకోట పంచాయతీలో భీమవారం పీహెచ్‌సీని ఎంపీపీ శెట్టి నీలవేణి మంగళవారం సందర్శించారు. వైద్యసేవలపై ఆరా తీశారు. రోగులను పరామర్శించి అందుతున్న వైద్యసేవలను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మలేరియా కేసులు నమోదవుతున్న గ్రామాల్లో స్ప్రెయింగ్(పిచికారీ) చేయించాలని, పంచాయతీ ద్వారా ఫాగింగ్ యంత్రాలను వినియోగించాలన్నారు. వైద్యాధికారి శ్రీనివాస్ అనూప్, సిబ్బంది దాలన్నదొర, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని హరిత గెస్ట్ హౌస్‌లో మంగళవారం అనంతగిరి, తైడా, బొర్రా, అరకులోయ, లంబసింగి ప్రాంతాల్లో పనిచేస్తున్న టూరిజం శాఖ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మిక, ఉద్యోగుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ న్యాయ పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలు నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ప్రభుత్వ సంస్థ ప్రైవేటీకరణ తగదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. టూరిజం శాఖ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమష్టి పోరాటాలతోనే సమస్యలు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. నాయకులు గంగరాజు, బాబూరావు, అంజలిరావు పాల్గొన్నారు.

డివిజన్ పాస్టర్ల కమిటీ ఎన్నిక



చైర్మన్, ప్రెసిడెంట్‌లకు ఎన్నిక పత్రాలను అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు

ఎటపాక: చింతూరు డివిజన్ పాస్టర్ల కమిటీ ఎన్నిక మంగళవారం సీతాపురంలోని ఎఫ్రాయీము చర్చిలో జరిగింది. నాలుగు మండలాల పాస్టర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో చింతూరు డివిజన్ చైర్మన్‌గా వి.ఆర్.పురం మండలానికి చెందిన గన్నిత్రి గాబ్రియేల్, డివిజన్ ప్రెసిడెంట్‌గా ఎం రాము, ఇన్‌చార్జ్‌గా పీటర్ సింగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా బి.డేవిడ్, లివింగ్‌స్టన్‌లను ఎన్నుకున్నారు. ఏఎస్సార్ జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ ఫౌండర్ ప్రెసిడెంట్ బిషప్ స్టీఫెన్, కార్యదర్శి చందర్‌పాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నిక కార్యక్రమంలో కిరణ్, డానియేల్, బోయజ్, యేసుబాబు, భీమయ్య, కరుణాకర్, జోనస్, ఆమోస్ తదితరులున్నారు.

దేశానికే ఆదర్శం జగనన్న పాలన

- శివారు గ్రామాల్లో గడప గడపకు విశేష స్పందన
- ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణకు ఘన స్వాగతం



గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



మధుం గ్రామానికి గెడ్డ దాటి వెళ్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, నాయకులు

కొయ్యూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మర్రివాడ సచివాలయం పరిధిలో లూసం, భలభద్రంపాడు, తాళ్లపాలెం, దొడ్డవరం ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 275 గడపలను ఆమె సందర్శించారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా లూసం గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠాలు బోధించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు.అనంతరం గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేశారన్నారు. గిరిజన ప్రాంతాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గడప గడపకు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటించి, ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. లూసంలో పాడైన పాఠశాల భవనం మరమ్మతులు, తాగునీటి, రోడ్డు సమస్యలను స్థానికులు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి స్పందించి సర్పంచ్, ఎంపీటీసీ కలిసి రోడ్డుకు ఇంజినీర్లతో అంచనా వేయిస్తే నిధులు వచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా పాఠశాలకు మరమ్మతుల కోసం సర్పంచ్ కలెక్టర్‌ను కలిస్తే నిధులు ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైపు ప్రజలంతా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఎంపీపీ బడుగు రమేష్ బాబు, జెడ్పీటీసీ వారా నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటమణ, అంబటి నూకాలు, సర్పంచ్ సత్యవతి, శ్రీను, సోమన్నదొర, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి నూకరాజు, మండల కన్వీనర్ బండి సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, జిల్లా పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు బి.అప్పారావు, మల్లేశ్వరి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు బాబ్జీ, నాయకులు గోపి, అచ్చిరాజు, సావిత్రి, పద్మలత, రాజుబాబు, నానాజీ, శేఖర్, చిన్నారావు, ఆనంద్, వెంకటేశ్ రామారావు, అచ్యుత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శ

తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్‌కె బషీర్‌ఖాన్‌ను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి రాజేంద్రపాలెంలో మంగళవారం పరామర్శించారు. త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎలాంటి సాయం కావాలన్నా అందిస్తామని ధైర్యం చెప్పారు.

శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు

హుకుంపేట: నియోజకవర్గంలో శివారు గ్రామాల్లో సైతం అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని గన్నేరుపుట్టు పంచాయతీ కేంద్రంతో పాటు డొంకినివలస, మధుల, కోటగరువు, గెడ్డవలస, కంగారుమామిడి తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కోటగరువు గ్రామం నుంచి మధుం గ్రామం వరకు రహదారి సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో కాలినడకన నడుస్తు గెడ్డలు దాటుకొని ప్రయణించారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 241 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ మాట్లాడుతు గిరిజన గ్రామల్లో అభివృద్ధి పనులకు కోట్ల రూపాయలు వెచ్చించామన్నారు. గిరి గ్రామాలు అభివృద్ధి పథంలో ప్రయాణిస్తున్నాయన్నారు. గన్నేరుపుట్టు, చీకుమద్దుల పంచాయతీల్లో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు బాకురు నుంచి గన్నెరుపుట్టు వరకు బీటి రోడ్డు వేయించామన్నారు. చీకుమద్దుల నుంచి డల్లపల్లి వరకు ప్రస్తుతం రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కొద్ది రోజుల్లోనే గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడతామన్నారు. డొంకినివలసలో తాగునీటి పథకం కోసం రూ.7లక్షలు మంజురు చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సింహాచలం, జిల్లా పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ధర్మయ్యదొర, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ కొండల రావు, వైస్ ఎంపీపీ(సీపీఎం పార్టీ) సుడిపల్లి కొండలరావు, సర్పంచ్ కృష్ణారావు, యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు ,నాయకులు సదాశివరాజు, చిన్నబ్బి, మహేష్, సుబ్బారావు, వెంకట్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సుష్మ

రాజవొమ్మంగి: మండలంలోని కొత్తకింద్ర, తాళ్లపాలెం గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 60 మంది రోగులను పరీక్షించి అవసరమైన చికిత్స, ఉచితంగా మందులు అందజేసినట్టు లాగరాయి పీహెచ్‌సీ డాక్టర్ సుష్మా తెలిపారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రాఖీల అమ్మకాల జోరు



పాడేరులో రాఖీలు కొనుగోలు చేస్తున్న విద్యార్థినులు

సాక్షి,పాడేరు: పవిత్ర రాఖీ పౌర్ణమి రక్షాబంధన్‌తో మంగళవారం పాడేరులో రాఖీల అమ్మకాలు జోరందుకున్నాయి. మెయిన్‌రోడ్డు, పాతబస్టాండ్, సినిమా హాల్ సెంటర్ ప్రాంతాల్లో రాఖీల దుకాణాలను ఏర్పాటు చేశారు. యువతులు, మహిళలం రాఖీలను కొనుగోలు చేశారు. రూ.20 నుంచి రూ.200 ధర వరకు రాఖీలను విక్రయించారు.

నేత్రదానంపై అవగాహన



అనంతగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గంగవరంలో నేత్రదానంపై అవగాహన ర్యాలీ

అనంతగిరి: మండల కేంద్రంలో మంగళవారం నేత్రదాన ప్రచార పక్షోత్సవాల్లో భాగంగా పారామెడికల్ అప్తాలమిక్ అధికారి (పీఎంవో) కె.లక్ష్మీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్ర దానం అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. నేత్రదానంపై అపోహలు వీడాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం: నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని కంటి వైద్యులు ఏసుపాదం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఓ.భావన మాట్లాడుతూ ఒకరి నేత్రదానం ఇద్దరి జీవితాలకు వెలుగు నింపుతుందన్నారు. నేత్రదానం చేయండి.. జీవితాలకు వెలుగునివ్వండి అంటూ నినాదిస్తూ విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కంటి వైద్యుడు ఏసుపాదం మాట్లాడుతూ కంటి సంబంధిత వ్యాధులపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆశ్రమ బాలికోన్నత పాఠశాల పీఈటి పద్మావతి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: గిరిజన గ్రామాల్లో కనెక్టవిటీ రహదారుల నిర్మాణాలతో ప్రజలకు మరింత రోడ్డు, రవాణా సదుపాయాలు కలుగుతాయని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి చెప్పారు. మండలంలో సొలభం సచివాలయం–2లోని గొందిపాడు నుంచి చీడీపాలెం గ్రామాల మధ్య ఉపాధి హామీ పథకం కింద రూ.7లక్షలతో మంజూరైన 2 కిలోమీటర్లు మట్టి రోడ్డు నిర్మాణ పనులను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉపాధి పనులు సద్వినియోగం చేసుకొని గిరిజనులు ఆర్థికాభివృద్ధి చెందాలని కోరారు. సర్పంచ్ ఐసరం హనుమంతరావు, ఎంపీటీసీ చిన్నారావు, మాజీ ఎంపీపీ ఎం.వెంకట గంగరాజు, నాయకుడు నర్సింహమూర్తి, టీపీ రాం ప్రసాద్, వీఆర్పీ దేవి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



డుంబ్రిగుడలో విద్యార్థినుల విన్యాసం



అరకులోయలో ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



విద్యార్థులకు క్రికెట్ కిట్లు అందిస్తున్న వార్డెన్ వినాయకరావు



గంగవరంలో ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అరకులోయ రూరల్: జిల్లా వ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలు, పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో పలువురు మాట్లాడుతూ ప్రముఖ హాకీ క్రీడాకారుడు, ఒలింపిక్ స్వర్ణ పతక విజేత, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ తదితరు ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అరకులోయలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వ్యాయామ అధ్యాపకులు గురువయ్య, వైస్ ప్రిన్సిపాళ్లు చలపతిరావు, పుష్పరాజు, సుందరిరాణి, నాగబాబు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్థానిక కేజీబీవీలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చింతపల్లిరూరల్: గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం కొండలరావు పాల్గొన్నారు. జూనియర్ కాలేజీలో వార్డెన్ పసుపులేటి వినాయకరావు విద్యార్థులకు క్రికెట్ కిట్లు అందజేశారు.

పాడేరు రూరల్: ఉత్తమ క్రీడాకారులను పి.బుజ్జిబాబు, జి.సింహాచలం నాయుడు, ఎం.దేవి. ఎం .హేమవతిలను గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్‌తో సత్కరించారు.

గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఝూన్సీహేనన్స్, డిప్యూటీ వార్డెన్ లక్ష్మీకాంత, పీఈటీ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కొత్తాడ కేజీబీవీలో ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు. టేకులవీధి , వేములోవ, గంగవరం పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, సత్యనారాయణ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు

జి.మాడుగుల: మండలంలోని బొయితిలి, ఉవ్వాసింగి పంచాయతీ కేంద్రాల్లో ఎంపీడీవో చంద్రశేఖరరావు పర్యటించారు. బొయితిలిలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. జగనన్న విద్యా కానుక వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎర్రగొప్పు గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. బడిఈడు పిల్లలను పాఠశాల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బొయితిలిలో నూతనం సచివాలయ భవనాన్ని సందర్శించారు. భవనాన్ని త్వరితగతిన ప్రారంభించాలని సిబ్బందికి సూచించారు. ఎంఈవో సీహెచ్. బాబూరావుపడాల్, ఏటీడబ్ల్యూవో తిరుపాల్, పీఆర్ ఏఈ మాణిక్యం తదితరులున్నారు.

తెలుగు భాష మనందరి శ్వాస



రాజవొమ్మంగిలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు



చింతూరులో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



అనంతగిరిలో ఉపాధ్యాయురాలను సన్మానిస్తున్న హెచ్‌ఎం మంగమ్మ, తదితరులు



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు



కొయ్యూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్, పక్కన అధ్యాపకులు



పాడేరు కాలేజీలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ టి.ఎస్.రసూల్, పక్కన అధ్యాపకులు

డుంబ్రిగుడ: జిల్లా వ్యాప్తంగా తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

తెలుగుభాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయురాలను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడుగిడుగు రామూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తామన్నారు. తెలుగు భాష మనందరి శ్వాసగా అభివర్ణించారు. ప్రపంచీకరణ పోకడలతో కనుమరుగవుతున్న తెలుగు భాషను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గిడుగు రామ్మూర్తి వ్యవహారికి తెలుగు భాష కోసం ఎనలేని కృషి చేసారని కొనియాడారు. తెలుగు భాషపై పట్టు సాధిస్తేనే మిగిలిన భాషలు నేర్చుకోవడం సులభతరం అవుతుందన్నారు. తెలుగు భాష అభివృద్ధికి పాటుపడాలన్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు.

డుంబ్రిగుడ: కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సుజాత, ఉపాధ్యాయులు కుమారి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలోగల గిరిజన సంక్షేమ బాలికల–2 పాఠశాలలో హెచ్‌ఎం మంగమ్మ, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక జిల్లా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.ఎస్.రసూల్, ఎన్ఎస్ఎస్ పీవోలు పి.రమేష్, సిహెచ్. అనిత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌కె.హరూన్, తెలుగు శాఖాధిపతి మహాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, తెలుగు శాఖాధిపతి రవికుమార్, పీడీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామారాజు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఝూన్సీహేనన్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

రాజవొమ్మంగి: అప్పలరాజుపేట అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న పేరంటాలమ్మ అమ్మవారికి మంగళవారం పూజలు నిర్వహించారు దూసరపాము సర్పంచ్ చీడి శివ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలకు స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ అన్నదానం నిర్వహించారు.

ఆత్మీయ వీడ్కోలు

సాక్షి, పాడేరు: పాడేరు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఐ.మురళీ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా పార్వతీపురం బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో సిబ్బంది మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. మురళీ దంపతులను ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. వర్తక సంఘం తరపున స్థానిక ఉప సర్పంచ్ బూరెడ్డి రాము మోదకొండమ్మ తల్లి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.

వినియోగదారుల సంఘం ఎన్నిక రేపు

పాడేరు రూరల్ : జిల్లా వినియోగదారుల కార్యవర్గ ఎన్నిక గురువారం నిర్వహిస్తున్నట్టు సంఘం డివిజన్ అధ్యక్షుడు చిట్టిబాబు తెలిపారు. విశాఖపట్నం జిల్లాలో కొనసాగుతున్న కార్యవర్గాన్ని రద్దు చేసి , జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు.

పాఠశాల సమస్య పరిష్కారానికి కృషి

అనంతగిరి: కొండిబ పంచాయతీ డముకు మండల పరిషత్ పాఠశాలను మంగళవారం జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల సమస్యను కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పట్టాదారు పాస్‌బుక్ మరియు టైటిల్‌డీడ్ పోయినవి

నేను అనగా తుర్రం రాముయ్య S/o. రాజయ్య (లేటు), వెగితోట గ్రామం, చింతూరు మండలం, అల్లూరి జిల్లాకు చెందిన ST (Koya) కులస్తుడను. మా పెదనాన్న తుర్రం చిన్న దేశయ్య (లేటు) S/o.ముకయ్య. నా యొక్క మనవి ఏమనగా నిన్నటి దినమున అనగా ది:28-08-2023న మా చింతూరు మండల కార్యాలయం పని మీద మా పెద్ద నాన్న అనగా తుర్రం చిన్న దేశయ్య S/o. ముకయ్య గారి పట్టాదారు పాసు పుస్తకం మరియు టైటిల్ డీడ్ (పాస్ పుస్తకం నెం.4, సర్వే నెం.19/2అ) అయినటువంటి భూమికి సంబంధించిన పత్రాలు పట్టుకుని వెళ్లి పని చూసుకుని తిరిగి చింతూరు నుండి మా గ్రామం వేగితోటకు వెళ్తూ ఉండగా సాయంత్రం 4 గం॥ to 5 గం॥ మధ్యలో ఎక్కడో మిస్ అయ్యాయి. కావునా, ఎవరికైనా దొరికిన యెడల దయచేసి ఈ నెం:9618851164కి ఫోన్ చేయగలరని కోరి ప్రార్థిస్తున్నాను.